

ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న బస్తీ నాయకులు

రోటరీ బస్తీలో సౌకర్యాల కల్పనకు చర్యలు

కవాడిగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ కాలనీలో కనీస సౌకర్యాల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ హామీ ఇచ్చారు. బస్తీలో సమస్యలు పరిష్కరించాలని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేయడంతో కార్పొరేటర్ జి. రచనశ్రీతో కలిసి బుధవారం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కమ్యూనిటీహాల్ నిర్మించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బస్తీ అధ్యక్షుడు బండారి యాదగిరి ఆధ్వర్యంలో డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ రచనశ్రీకి సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు. ఎ. ప్రభాకర్ గంగపుత్ర, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పైప్‌లైన్ నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

జవహర్ స్కూల్ వద్ద రూ. 50 లక్షలతో పైప్‌లైన్

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ నుంచి ఆర్టీసీక్రాస్‌రోడ్‌కు వెళ్ళే దారిలో రూ. 50 లక్షల వ్యయంతో జవహర్‌స్కూల్ వద్ద కచ్చానాలా పైప్ లైన్ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని గాంధీనగర్‌డివిజన్ కార్పొరేటర్ ఎ. పావని వివరించారు. బుధవారం ఆ ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పైప్‌లైన్ నిర్మాణంతో వరద నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, ఆకుల సురేందర్, నవీన్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న

ప్రైవేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలి

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్ట బబ్లూగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా హక్కు చట్టం కాగితాలకే పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నం.1ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అమలు చేయడం లేదన్నారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఒకే ఫీజు విధానం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

డీబీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్‌రావు



కవాడిగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన పార్టీ (డీబీపీ) తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నక్కా రాజేందర్‌రావు నియమితులయ్యారు ఆయన నియామకాన్ని దళిత బహుజనపార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రకటించారు. నక్కా రాజేందర్‌రావు మాట్లాడుతూ.. దళిత బహుజనుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు



కార్మికులను పరీక్షిస్తున్న వైద్యురాలు

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో బుధవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు బీపీ, మాస్టర్ హెల్త్ చెకప్, ఈసీజీ తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ ఎ. విజయ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. గుర్తింపు కార్డు ఉన్న అసంఘటితరంగ కార్మికులకు వైద్య సేవలు అందింజేందుకు వాడవాడలా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కో-ఆర్డినేటర్ సాయికుమార్, వైద్య సిబ్బంది జ్యోతి, రోహిత్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.



నికోలా టెస్లా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ సభ్యులు

నికోలా టెస్లాకు నివాళి

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైర్ల ద్వారా విద్యుత్‌ను అందించాలని కలలుగన్న ప్రపంచ మేధావి నికోలా టెస్లా అని గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేటు ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు అన్నారు. నికోలా టెస్లా జయంతి కార్యక్రమాన్ని బుధవారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల అధ్యక్షులు నర్సింగ్‌రావు, శ్రీకాంత్, యూనియన్ ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్‌చారి, వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు ఎల్లేష్, జహంగీర్‌బాబు, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగిలించి

అకౌంట్ నుంచి రూ. 1.10 లక్షలు డ్రా

బర్కత్‌పుర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ అపహరించి అకౌంట్ నుంచి రూ. 1.10 లక్షలు డ్రా చేశారు దొంగలు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌కు చెందిన గంటి భగవతి నెల్లూరు వెళ్లడానికి ఈ నెల 9న కాచిగూడ రైల్వే స్టేషన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చింది. రైలు ఎక్కుతుండగా సెల్ ఫోన్‌ను దొంగలు అపహరించారు.

దీంతో భగవతి ప్రయాణాన్ని రద్దు చేసుకొని తిరిగి ఇంటికి వెళ్లారు. తన అకౌంట్ నుంచి రూ. 1.10 లక్షలు డ్రా చేసినట్లు బుధవారం బ్యాంకుకు వెళ్లగా తెలియడంతో కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంగపుత్ర కాలనీలో

రూ. 6 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునికీకరిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గంగపుత్ర కాలనీలో రూ. 6 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మాచర్ల పద్మజ, సీనియర్ నాయకుడు సుధాకర్ గుప్తా, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్‌లో డ్రైనేజీ, కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులను ఆదేశించారు. బుధవారం కట్టంబాయిబస్తీ, అడిక్‌మెట్ ఫ్లైఓవర్, ఆజామాబాద్ ప్రాంతాలలో ఆయన పాదయాత్ర చేశారు. కట్టంబాయి బస్తీలో డ్రైనేజీ సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బస్తీలు, కాలనీలు, ప్రధాన రోడ్లపై మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శివసాయి, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్, సయ్యద్ అస్లాం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో దత్తసాయి కాంప్లెక్స్‌లో మంటలు
- ఐదు ఫైరింజన్లతో అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



ఎగసి పడుతున్న మంటలు

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోగల దత్తసాయి కాంప్లెక్స్‌లో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. రెండో అంతస్తులో 202 రూమ్‌లో టప్పర్‌వేర్ కంపెనీ గోడౌన్ నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం సిబ్బంది తాళాలు వేసి వెళ్లిపోయారు. 6.45 గంటల సమయంలో గోడౌన్ నుంచి మంటలు ఎగసి పడడంతో కాంప్లెక్స్‌లోని వ్యాపారులు బయటకు పరుగులు తీశారు. పక్కనేగల ఆస్పత్రిలోని రోగులను ముందు జాగ్రత్తగా మరోచోటకు తరలించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందిని రప్పించారు. ఐదు ఫైరింజన్లతో రాత్రి 8 గంటల వరకు మంటలను అదుపు చేశారు.

గోద్రెజ్ కంపెనీకి చెందిన ఆఫీస్‌లో చిక్కుకున్న శ్రీధర్, సురేందర్‌ను చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య బయటకు తీసుకొచ్చారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్, ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, కార్పొరేటర్ రవిచారి పరిస్థితిని సమీక్షించారు. సాయంత్రం 5.30 గంటల సమయంలోనే గోడౌన్ నుంచి పొగ వచ్చినట్లు గమనించిన సిబ్బంది బయటకు వెళ్లిపోయినట్లు కొందరు చెబుతున్నారు. నాలుగైదు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు గంటలు ట్రాఫిక్‌జామ్

అగ్నిప్రమాదం నేపథ్యంలో క్రాస్‌రోడ్ నుంచి ముషీరాబాద్ చౌరస్తా వరకు ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రం ఏడు నుంచి రాత్రి పదిగంటల వరకు కూడా ట్రాఫిక్ రద్దీ తగ్గలేదు.

ఎన్నికల హామీలను సత్వరమే అమలు చేయాలి

- షీ టీమ్స్ ఉన్నా మహిళలపై కొనసాగుతున్న అఘాయిత్యాలు
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ సత్వరం అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలలో రెండే అమలు చేసిందని అన్నారు. పెండింగ్ డీఏలు విడుదల చేస్తామని చెప్పినా ఒక్కటీ విడుదల చేయలేదని చెప్పారు. పారిశ్రామిక రంగంలో జరుగుతున్న ప్రమాదాలపై ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం 2003 విద్యుత్తు చట్టానికి సవరణ తెచ్చి రాష్ట్రాల హక్కులను హరిస్తూ పార్లమెంట్‌లో చట్టం ఆమోదించారని, దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాతబస్తీలో విద్యుత్ బిల్లుల వసూలు ఆదానీ కంపెనీకి అప్పజెప్పడాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. రాష్ట్రంలో షీటీమ్స్ ఉన్నప్పటికీ మహిళలపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయని, అదనపు రక్షణ టీంలను ఏర్పాటు చేయాలని కోరారు. పోడు భూములు సాగు చేస్తున్న వారికి పట్టాలు ఇవ్వాలని రాఘవులు డిమాండ్ చేశారు.

రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీని నిలువరించడమే తమ పార్టీ ప్రధాన కర్తవ్యమని చెప్పారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని, నిధుల కొరత చూపి ఎగ్గొట్టే ప్రయత్నం చేయకూడదని అన్నారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య మాట్లాడుతూ, మెదక్‌లో జరిగిన మతోన్మాద ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులపై దాడిచేసిన సీఐ క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ, గ్రూప్ - 2 పరీక్షలు వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు, కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయడం అమానుష చర్య అని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు.

బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్ - 2, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని 10 రోజుల నుంచి విద్యార్థి సంఘాలు ఓయూలో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. 10, 15 రోజుల వ్యవధిలో పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. విద్యార్థులపై దాడి చేసిన సీఐ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బంగారు శ్రీనివాస్, కొల్లూరు వెంకట్, చందు, తిరుమలేష్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



అసదుద్దీన్ ఒవైసీకి వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కవాడిగూడ. జూలై 10 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా(ఎల్ఐసీ) సంస్థ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్(ఐసీఈయూ) సికింద్రాబాద్ డివిజన్ నేతృత్వంలో నాయకులు బుధవారం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. గుణశేఖర్, డీఎస్ రఘు, జోనల్ ఫెడరేషన్ కోశాధికారి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. భారతీయ జీవిత బీమా సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భారతీయ జీవిత బీమా సంస్థ పాలసీ ప్రీమియంపై 18 శాతం జీఎస్టీని ఎత్తివేయాలని, పాలసీదారులు పొదుపు చేసుకున్న డబ్బుపై ఇన్‌కంటాక్స్ మినహాయింపు ఇవ్వాలని, నాలుగు ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలను విలీనం చేయాలని కోరారు. ఈ విషయాలను పార్లమెంటులో ప్రస్తావించి ఎల్ఐసీ ఉద్యోగులకు న్యాయం చేస్తానని అసదుద్దీన్ ఒవైసీ హామీ ఇచ్చారని వారు తెలిపారు.

ఒవైసీని కలిసిన వారిలో డివిజనల్ నాయకులు హెచ్ఎస్ చంద్రశేఖర్, ఎండీ జావిద్, రాములు, విష్ణు తదితరులు ఉన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ ఉద్యమం

- ఆగస్టులో మూడు జిల్లాల్లో లక్ష మందితో బహిరంగ సభలు



అభివాదం చేస్తున్న ఆర్. కృష్ణయ్య, వి. హనుమంతరావు తదితరులు

బర్కత్‌పుర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య వెల్లడించారు. ఆగస్టులో నల్లగొండ, మెదక్, వరంగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో బీసీల మేధో మదన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు 52 శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టే జనగణనలో బీసీ కుల గణన చేపట్టాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు 27 నుంచి 56 శాతానికి పెంచాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామకాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, జాతీయ స్థాయిలో లక్ష కోట్ల బడ్జెట్‌తో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని, దేశంలోని బీసీలంతా తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. బీసీల న్యాయమైన డిమాండ్లపై దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ సత్యం, నీల వెంకటేష్, మల్లేష్‌యాదవ్, జిల్లపల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

నల్లకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పిలుపునిచ్చారు. 75వ వనమహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం అంబర్‌పేట డివిజన్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐఎస్‌టీ) ప్రాంగణంలో కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. వెంకట్‌రెడ్డి, అర్బన్ బయోడైవర్సిటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్, మేనేజర్లు భాస్కర్, మహేశ్వరి, గణేష్, సూపర్‌వైజర్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



ఆంధ్ర మహిళా సభలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట ట్రాఫిక్ సీఐ వి. రాంచందర్

నల్లకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వాహనదారులతోపాటు ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ వి. రాంచందర్ సూచించారు. బుధవారం విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ సిబ్బంది, విద్యార్థులకు 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఛాయానందిని, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ స్రవంతి, నల్లకుంట ట్రాఫిక్ పీఎస్ ఎస్ఐ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



వ్యక్తి మృతదేహం

కవాడిగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 9వ తేదీ రాత్రి కల్పనా థియేటర్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిని చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వాసంశెట్టి శ్రీనివాస్(48) సచివాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నింగి కృష్ణ, ఎ. మల్లేష్ తదితరులు 12 మంది నుంచి రూ. 30 లక్షల రూపాయలు వసూలు చేశాడు. వారికి నకిలీ ధ్రువపత్రాలు, ఐడీ కార్డులు ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితుడు నింగి కృష్ణ గత ఏడాది ఏప్రిల్ 20న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని బుధవారం అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాస్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను ఏసీపీ రమేష్‌కుమార్ అభినందించారు.

మల్లారెడ్డి 'అగ్రి' వర్సిటీలో

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- వసతిగృహం పై నుంచి దూకిన బీఎస్సీ స్టూడెంట్
- విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రగాయాలు

పేట్‌బషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించాడు. పురుగుల మందు తాగి వసతి గృహం భవనం పై నుంచి కిందకు దూకాడు. విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన రామారావు కుమారుడు శెట్టిపెల్లి హరినాథ్(26) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడలో మల్లారెడ్డి అగ్రికల్చరల్ యూనివర్సిటీలో మూడో సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతూ సాయిబాలాజీ వసతి గృహంలో ఉంటున్నాడు. మూడు రోజులుగా యూనివర్సిటీకి వెళ్లడం లేదు. మంగళవారం హైదరాబాద్‌లో ఉంటున్న అక్క వద్దకు వెళ్లివచ్చాడు. బుధవారం తోటి విద్యార్థులు కళాశాలకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో పురుగుల మందు తాగిన హరినాథ్ వసతిగృహం 5వ అంతస్తు పై నుంచి దూకాడు. పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వసతిగృహం నిర్వాహకులు తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. 108 సహాయంతో అతడిని కొంపల్లిలో శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 12 లక్షల విలువచేసే వాచ్‌లతో

షోరూం ఉద్యోగి పరారీ

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల విలువచేసే వాచ్‌లు, నగదుతో ఉడాయించిన షోరూం ఉద్యోగిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36 కమల్ వాచ్‌షోరూంలో నవీన్‌వ్యాస్, చేతన్ బెటల కొద్ది కాలంగా పనిచేస్తున్నాడు. గతనెల 28 నుంచి చేతన్ పనికి వెళ్లడం లేదు. అదేరోజు నవీన్‌కు ఫోన్ చేసి తాను జూన్ 22కు ముందు రెండు వాచ్‌లు, ప్రస్తుతం మరో వాచ్‌చోరీ చేశానని, వాటిని త్వరలో తిరిగి ఇచ్చేస్తానని చెప్పాడు. రోజులు గడుస్తున్నా చేతన్ వాచ్‌లను తిరిగి ఇవ్వకపోవడంతో నవీన్ విషయం యాజమాన్యానికి చెప్పాడు. పరిశీలించగా మూడు వాచ్‌ల విలువ సుమారు రూ. 12 లక్షలు ఉంటుందని, ఓ వినియోగదారుడి నుంచి షోరూంకు చెందిన రూ. 2 లక్షలను కూడా తీసుకున్నట్లు గుర్తించారు. షోరూం నిర్వాహకుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరలక్ష్మి పూజ చేస్తానని నమ్మించి

లక్ష రూపాయలతో మహిళ మాయం

బంజారాహిల్స్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మిపూజ చేస్తానని, అమ్మవారి ఎదుట డబ్బు పెట్టి వేడుకుంటే అంతా మంచి జరుగుతుందని గృహిణిని మోసం చేసి లక్ష రూపాయలతో ఓ మహిళ ఉడాయించింది. జూబ్లీహిల్స్‌రోడ్డు నంబర్ 41లో నివసిస్తున్న డాక్టర్ ఆర్ఎస్ సుబ్బారెడ్డి వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు.

ఈనెల 8వ తేదీ రాత్రి ఆయన ఇంట్లో లేని సమయంలో ఓ మహిళ ఒంటి నిండా నగలు వేసుకొని వచ్చింది. సుబ్బారెడ్డి భార్యతో మాటలు కలిపింది. వరలక్ష్మి పూజ చేస్తే అంతా మేలు జరుగుతుందని నమ్మించింది. మాటల్లో పెట్టి ఇంట్లోకి వచ్చి పూజ మందిరంలో కూర్చుంది. సుబ్బారెడ్డి భార్య నిజమే అనుకొని పూజలో పాల్గొన్నారు. కొద్ది సేపటి తర్వాత అమ్మవారి ఎదుట డబ్బు పెట్టి వేడుకుంటే అంతా మంచి జరుగుతుందని చెప్పింది.

ఆయన భార్య ఇంట్లో ఉన్న లక్ష రూపాయలను పూజ గదిలో పెట్టింది. ఆమె కళ్లు మూసుకొని దేవుడిని ప్రార్థిస్తుండగా మహిళ లక్ష రూపాయలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. కొద్ది సేపటి తర్వాత ఆమె కళ్లు తెరిచి చూడగా మహిళ, డబ్బు కనిపించలేదు. సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.